# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

A professional writer is an amateur who did not quit.
--- Richard Bach

## 6

### మరి కొందరు సంపాదకుల గురించి

జనవరి 1986 లో ఓ టి వి ఛానల్‌లో జాక్ కేసిడి అనే కార్టూనిస్ట్ 'ఫన్నీ బిజినెస్' అనే కార్టూన్ షోని ఇచ్చాడు. చాలాకాలంగా కార్టూనిస్ట్ అవాలన్న ఆలోచన గల స్కాట్ ఏడమ్స్ అనే అతను జాక్ కేసిడికి తగిన సలహాలని కోరుతూ, తను గీసిన కొన్ని కార్టూన్లని పంపుతూ ఉత్తరం రాసాడు.

కొన్ని వారాల తర్వాత జాక్ నుంచి దానికి జవాబు వచ్చింది. అతను గీసి పంపినవి ప్రచురణార్హమని తను భావిస్తున్నానని, ఐతే అవి తిరస్కరించబడ్డా నిరుత్సాహం చెందక కార్టూన్లు గీయడం కొనసాగించమని అందులో రాసాడు. స్కాట్ వెంటనే కార్టూన్లు గీసే వస్తువులని కొని, కొన్ని కార్టూన్లని గీసి ప్లేబాయ్, ది న్యూయార్కర్ పత్రికలకి పంపాడు. వారి నుంచి అవి వెనక్కి తిరిగి వచ్చేయడంతో స్కాట్ నిరుత్సాహ పడి కార్టూన్లని గీయడం విరమించుకున్నాడు.

జూన్ 1987లో స్కాట్‌కి తిరిగి జాక్ కేసిడి నుంచి ఓ ఉత్తరం వచ్చింది. 'ఫన్నీ బిజినెస్' ఫైల్‌ని ఏదో పనిమీద తను తిరగేస్తూంటే అతని ఉత్తరం, కార్టూన్లు కనిపించాయని, స్కాట్ వదలకుండా వాటిని గీస్తున్నాడని ఆశిస్తున్నానని, కార్టూన్ల మీద డబ్బులు సంపాదించమని తన శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆ ఉత్తరం రాసాడు.

స్కాట్‌కి ఆశ్చర్యం వేసింది. ఆ ఉత్తరం రాయడం వల్ల జాక్‌కి వచ్చే లాభం లేదు. ఐనా రాసాడు. పైగా అతను తనకి రాసిన జవాబుకి థాంక్స్ లెటర్‌ని కూడా స్కాట్ రాయలేదు. ఆ ఉత్తరం ఇచ్చిన ప్రోత్సాహంతో డిబ్బర్ట్ అనే పాత్రని సృష్టించి కార్టూన్లని గీసి పంపాడు. అవి అంగీకరించబడ్డాయి. తర్వాత డిబ్బర్ట్ ఏడువందల పత్రికల్లో ప్రచురింపబడటమే కాక, ఆరు పుస్తక సంకలనాలుగా కూడా వెలువడింది. స్కాట్ ఏడమ్స్ కార్టూనిస్ట్‌గా స్థిరపడ్డాడు. అందుకు కారణం? ఓ ప్రముఖ వ్యక్తి నుంచి వచ్చిన ప్రోత్సాహ పూర్వక ఉత్తరమే.

సంపాదకులుగా వారు వారి బాధ్యతలో భాగంగా నా కథలని, నవలలని చాలామంది సంపాదకులు ఎంపిక చేసినా, పరోక్షంగా వారు నన్ను రచయితగా ప్రోత్సహించినట్లే అవుతుంది. సంపాదకుల పాత్ర రచయితలని బ్రతికించడం లేదా చంపేయడంలో ఎంతటిదో తెలియచేసే ఓ సంఘటన కాబట్టి దీన్ని ఇక్కడ ప్రస్థావించాను. నేను కలిసి, నాకు గుర్తుండిపోయిన సంపాదకుల్లో మరో విశిష్టమైన వ్యక్తి శ్రీ పురాణం సుబ్రమణ్య శర్మ.

### శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ



1970 లలో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికల తర్వాత ఆంధ్రజ్యోతి ప్రముఖవార పత్రికగా ఉండేది. దానికి కూడా నేను కథలు పంపేవాడిని.

1974లో ఓసారి 'నవలా ప్రియదర్శిని' అనే చిన్న నవలల పోటీని ఆంధ్రజ్యోతిలో ప్రకటించారు. ఆరు నవలలని సంపాదకులు ఎంపిక చేసి, తర్వాత పాఠకులు బేలట్ ద్వారా ఆ ఆరింటిలోంచి మళ్ళీ ఒకదాన్ని ఉత్తమ నవలగా ఎంపిక చేసే స్కీం అది. ఆ పోటీకి రేపటి కొడుకు అనే నవలని రాసాను. పని మీద విజయవాడ వెళుతున్నా కాబట్టి పోస్టేజిని ఆదా చేయవచ్చని దాన్ని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో స్వయంగా అందచేయాలనుకుని వెంట తీసుకెళ్ళాను. విజయవాడ బందరు రోడ్డులోని ఆంధ్రజ్యోతి కార్యాలయం గురించి ఎంక్వయిరీ చేసి ఆ ఆఫీస్‌కి వెళ్ళాను.




విశాలమైన ఆవరణలో వెనకాల ఓ తెల్లటి భవంతి మొదటి అంతస్తులో ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక కార్యాలయం ఉంది. క్రింద ప్రెస్. శ్రీ పురాణం గారి దగ్గరకి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. చుట్టూ వ్రాత ప్రతుల కట్టలతో బీభత్సంగా ఉంది ఆయన కేబిన్. పొట్టిగా, చామన ఛాయలో ఉన్న ఆయన వయసు అప్పటికే నలభైపైన ఉంటాయి. కళ్ళజోడు. ఆయన రావిశాస్త్రిగారి అభిమాని అని అప్పట్లో నాకు తెలీదు. ఆయన అప్పటికే నా కథలు వేసి ఉండటంతో పేరు చెప్పగానే నన్ను గుర్తుపట్టారు. "గమ్మత్తయిన కథలు రాస్తున్నారు. అలాగే రాస్తూండండి" ప్రోత్సాహ పూర్వకంగా చెప్పారు.

"కాపీ కొట్టి కథలు రాస్తే మాకు తెలిసిపోతుంది." అనే చిన్న హెచ్చరికని కూడా చేసారు. బహుశా నేను విరివిగా అన్ని పత్రికల్లో కథలు రాస్తూండంటంతో కొన్ని కాపీ కథలన్న భావన ఆయన కలిగి ఉండాలి. రేపటికొడుకు నవల, సొంత చిరునామా గల కవరు వారికి ఇచ్చాను. ఆ విధంగా ఆయనతో మొదలైన పరిచయం చివరిదాకా కొనసాగింది - ముఖ్యంగా 1980ల్లో రచయితల నవలా యుగంలో .

ఆయన ఉత్తరాన్ని చదువుతూ 'ఊఁ', 'ఆఁ' 'అలాగా!' అంటూ మనిషి ఎదురుగా మాట్లాడితే ఇచ్చేలాంటి జవాబులు ఇస్తూ చదివేవారు. నా కది చిత్రంగా ఉంది

ఆంధ్రజ్యోతికి కథలు పంపే రచయితలకి ఎప్పుడూ ఓ సమస్య ఎదురయ్యేది. వేసుకుంటామనే ఉత్తరం రాదు. తిప్పి పంపరు. పంపిన రెండు మూడేళ్ళ తర్వాత కూడా కథలు వేసుకున్న సందర్భాలు ఉన్నాయి అని సాటి రచయితలు చెప్పేవారు.

1968లో చందు సోంబాబు ఆంధ్రజ్యోతి వారపత్రికలో పురాణం గారి కింద ఉపసంపాదకులుగా కొద్దికాలం పనిచేసారు. శ్రీ పురాణం మీద ఆయన చెప్పిన జోకిది. ఆయన మాటల్లోనే....'కథ కావాలన్నప్పుడు కథల కట్టలని పురాణం కాలితో తంతారు. కింద రాలి పడ్డ కథని తీసుకుని వేస్తారు'




ఈ సంఘటన కూడా శ్రీ సోంబాబు చెప్పారు'పురాణం గారికి నేనో కథని పంపాను. దాన్ని తిప్పి పంపారు. ఏడాది తర్వాత పేరు మార్చి మళ్ళీ దాన్ని ఫెయిర్ చేసి పంపాను. దాన్నీ తిప్పి పంపుతూ 'పేరు మార్చినంత మాత్రాన గుర్తుపట్టలేనా?'అని పురాణంగారు దానిమీద రాసి రిటన్ చేసారు.'

'ఈ ఏడాదిలో మీరేమైనా మేధాపరంగా ఎదిగారేమోనని పంపాను' అని నేను జవాబు రాసాను."

శ్రీ పురాణం పత్రికలో తరచూ ఏదైనా వివాదం రేపుతూండేవారు. పాఠకులు రెండు వర్గాలుగా చీలి కొట్టుకుంటూ రాసే ఉత్తరాలని ప్రచురించేవారు. అలా రంగనాయకమ్మ గారి మీద కూడా ఓ వివాదం చెలరేగింది. విషయం నాకు గుర్తులేదు. 'శ్రీ శ్రీ కి మిరియాల కషాయం' అంటూ మిరియాల రామకృష్ణగారి మీద కూడా ఓ వివాదం లేపారు.

'ఇలాంటివి నాకు సరదా' అని ఓసారి నాతో అన్నారు. అది సర్క్యులేషన్ పెంచడానికి కూడా దోహద పడేది.

'ఆంధ్రజ్యోతిని మధ్యకి మడుస్తున్నాను. చిన్న కథలు పంపండి' అని ఓసారి వారి నుంచి ఉత్తరం వచ్చింది. ఆంధ్రజ్యోతి సైజులో కాక దానికి సగం సైజులో వారపత్రికని కొంతకాలం తెచ్చారు. అందులో ఒక పేజీకి సరిపడే 'రక్షక భటుడు' అనే మినీ కథని, మరికొన్ని చిన్న కథలని రాసి పంపితే ప్రచురించారు. 'కొత్త కలాలు' అనే శీర్షికని పరిచయం చేసి కొత్త రచయితల కవిత్వాలని ఆ శీర్షికలో ప్రచురించేవారు. ఈ సైజు మార్పు వలన పత్రిక తయారీ ఖర్చు తగ్గింది. మునుపటికన్నా ఇది నాకు బాగా నచ్చింది.

కాని ఆరు నెలల తర్వాత అనుకుంటా. మళ్ళీ మొదటి సైజ్‌కే మళ్ళారు. నేను కారణం అడిగితే 'మన పాఠకులు చదివేసాక పత్రికలని తూకానికి అమ్మేస్తారు. చిన్న సైజు పత్రిక తక్కువ ధరకి పెద్ద సైజు పత్రిక ఎక్కువకి అమ్ముడవుతుంది. వారికి నష్టం రాకూడదని మన పత్రికని కొనడం ఆపేసారు' అన్నారు. అది నిజమో లేక వ్యంగ్యంగా చెప్పారో నాకు తెలీదు.

పురాణంగారి ఇల్లు బందరు రోడ్డు మీదకి ఉన్న ఓ సందులో ఎడమ వైపు ఉండేది. మేడ మీద ఓ పోర్షన్‌లో అద్దెకుండేవారు. నన్ను రెండు మూడు సార్లు వారింటికి తీసుకువెళ్ళారు. దారిలో చెప్పారు, తన భార్య సీత పుట్టింటి పేరు కూడా మల్లాదే అని. వాళ్ళబ్బాయి నానిని పరిచయం చేసారు. అతను బొమ్మలు గీసేవాడు. ఆ రోజుల్లోనే అతను అర్ధాంతరంగా పోయాడు. మరో కొడుకు శ్రీనివాస్ చక్కటి కథకుడుగా గుర్తింపు పొందాడు. రాసినవి తక్కువే అయినా వాసిగలవి రాసారు. తర్వాత అతను ఆంధ్రభూమిలో ఉద్యోగంలో చేరి హైదరాబాద్ వచ్చారు. ప్రస్తుతం ఆంధ్రప్రభ డెయిలీలో పనిచేస్తున్నారు.

పురాణం గారికి ఓ కూతురు కూడా ఉండేది. మద్రాస్ సంబంధం చేసిన గుర్తు. పురాణంగారి భార్య ఫక్తు మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబీకురాలిలా ఉండేవారు.

ఆంధ్రభూమిలో నా నవలలు 'దూరం, పెద్దలకు మాత్రమే' సీరియల్స్‌గా వెలువడ్డాక అంతదాకా కథా రచయితగా నాకున్న గుర్తింపు నవలా రచయితగా ఎంతో ఎత్తుకి ఎదిగింది. శ్రీ వీరేంద్రనాథ్, నేను, శ్రీ చందు సోంబాబు మొదలైన వారి రచనలవల్ల భూమి సర్క్యులేషన్ పెరగడంతో జ్యోతి వీక్లీ పోటీకి దిగింది. శ్రీ వీరేంద్రనాథ్ చేత, నా చేత పురాణంగారు ప్రత్యేకంగా సీరియల్స్ రాయించసాగారు. ఆ క్రమంలో వారితో పరిచయం అధికమైంది. రేపటి కొడుకు తర్వాత మళ్ళీ నేను జ్యోతికి ఏ సీరియల్ రాయలేదు. 'రెండు రెళ్ళ ఆరు' అనే హాస్య నవలని మొదటిసారిగా ఏడు సంచికల మేటర్ రాసి పంపాను. అది చదివి ఇంప్రెస్ అయి శ్రీ పురాణం 'ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి సీరియల్ త్వరలో ప్రారంభం' అని ప్రకటించారు. నా పుస్తకాలు ప్రచురించిన పబ్లిషర్స్ తమ ప్రకటనల్లో హాస్య నవలలకి ఆ కేప్షన్‌నే యధాతథంగా వాడసాగారు.



అంతకు మునుపు 'అనామిక' అనే మాసపత్రికని విజయవాడ నుంచి శ్రీమతి విజయలక్ష్మీ రాజ్ అనే ఆమె శ్రీ పురాణం ఆధ్వర్యంలో వెలువరించారు. ఆ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ హోటల్ లో రైటర్స్ మీట్‌ని ఏర్పాటు చేసారు. దానికి వైజాగ్ నుంచి శ్రీ రావిశాస్త్రి వచ్చారు. చాలామంది హైద్రాబాద్ రచయితలు నాలా ఆయన్ని చూడడానికి వచ్చారు. శ్రీ పురాణం రచయితలందర్నీ రావిశాస్త్రిగారికి పరిచయం చేసారు. నన్ను పరిచయం చేస్తూ 'గమ్మత్తయిన కథలు రాస్తారు' అని చెపితే, ఆయన నవ్వి 'గమ్మత్తయిన కథలు కాదు. మంచి కథలు రాయండి' అన్నారు. కమ్యూనిస్ట్ అనే పదం బదులు 'మంచి' అనే పదం వాడారనుకున్నాను. శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య విజయవాడనుంచి ఆ మీటింగ్‌కి అతిథిగా వచ్చారు,

"'అనామిక' అనే పేరు ఎందుకు పెట్టారో నాకు తెలీదు. 'అనామిక' అంటే చూపుడు వేలు అని అర్థం, అంతే తప్ప పేరు లేనిది అని కాదు. ఓ రచయిత్రి (కోడూరి కౌసల్యాదేవి అనుకుంటా) ఓ నవల్లో 'సానువులు చల్లగా వీస్తున్నాయి' అని రాసారు. సానువులు అంటే లోయలు అని అర్థం తప్ప గాలి అని కాదు" అని పెద్దభొట్ల సుబ్బరామయ్య తన ఉపన్యాసంలో చెప్పారు.

అప్పట్లో 'రైటర్స్ మీట్'ని ఓ పత్రిక వారు ప్రత్యేకంగా ఇలా ఏర్పాటు చేసి విందివ్వడం రచయితల కందరికీ కొత్త. తర్వాత పురాణంగారికి విజయలక్ష్మీ రాజ్ గారికి సరిపడక పురాణంగారు అనామిక నుంచి విరమించుకున్నారని విన్నాను.

పురాణం గారు మందు ప్రియులు. 1983 తర్వాత నేను అనేకసార్లు వారిని విజయవాడలోని ఈగిల్ బార్ అండ్ రెస్టారెంట్ అనే గార్డెన్ బార్‌కి తీసుకెళ్ళాను. అప్పట్లో నా పుస్తకాలు ప్రచురించే మహలక్ష్మీ బుక్ ఎంటర్ ప్రైజెస్ అధినేత శ్రీ నరసింహయోగి కూడా నాతో వచ్చేవారు. కాని ఆయనకి డ్రింక్స్ అలవాటు లేదు. రాత్రి పదకొండుకి పురాణంగారిని మళ్ళీ రిక్షా ఎక్కించేవాళ్ళం. రిక్షా అతనికి డబ్బు ఇచ్చేసేవాడిని. ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ శ్రీ నండూరి రామ్మోహన్ రావుగారికి పురాణం రచయితలతో కలిసి మందు తీసుకుంటున్నారని తెలిసి, అలా వద్దని మందలించేవారని, పెద్దమనిషి తరహాగా ఉండాలని పురాణంగారికి వారు బోధ చేసేవారట. తర్వాత తెలిసింది. కాని పురాణంగారు అది పట్టించుకునేవారు కాదు. శ్రీ నండూరిగారు కూడా డ్రింక్ తీసుకునేవారు. కాని తక్కువ మందితో తీసుకునేవారని, వారు శ్రీ బాపు రమణలు, శ్రీ నవోదయ రామ్మోహనరావు, శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు మాత్రమే. ఇది శ్రీ కొమ్మూరి ఓసారి చెప్పారు. బార్‌లో ఆయన చెప్పే అనేక విషయాలని మేమిద్దరం వింటూండేవాళ్ళం. 1960లలో పురాణంగారు ఢిల్లీలో రైల్వేస్‌లో అనుకుంటా పనిచేసేవారు. అప్పట్లో పురాణంగారు అద్దెకున్న లోగిలిలోనే సుదర్శన్ చిట్‌ఫండ్స్‌లో పని, చేసే శ్రీ రామోజీరావు కూడా అద్దెకుండేవారు. తర్వాత ఆయన హైదరాబాద్ వచ్చి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ని ఆరంభించారు. శ్రీ ఎల్ ఎన్ ప్రసాద్ గారి ఆహ్వానం మీద ఢిల్లీ లోని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, పురాణం గారు ఆంధ్ర జ్యోతి వార పత్రిక ఎడిటర్ గా చేరారు.

యర్రంశెట్టి సాయి. ఓ కథని ఆంధ్రజ్యోతికి పంపారు. సంవత్సరం దాటినా దాన్ని వేయకపోవడంతో సాయి దాన్ని ఆంధ్రపత్రిక కథలపోటీకి పంపారు. దానికి బహుమతి వచ్చింది. ఆ కథ పత్రికలో వచ్చిన వారమే ఆంధ్రజ్యోతిలో ఆ కథ వచ్చింది. దాంతో సాయికి ప్రకటించిన బహుమతి సొమ్మని పత్రికవారు ఇవ్వలేదు. ఆ కథకి బహుమతి వచ్చిందని తెలిసి పురాణం గారు కావాలని దాన్ని అదే వారం వేసారని చాలామంది రచయితల నమ్మకం ఆయనకి ఇతర రంగాలలో పేరు తెచ్చుకునే వారంటే గిట్టేది కాదు. ఆ రోజుల్లో బ్రూస్‌లీ సినిమాలు బాగా వచ్చేవి. 'కోతిలా ఎంత ఎత్తు ఎగరగలిగితే వాడంత గొప్ప హీరో' అని బ్రూస్‌లీని వెక్కిరించేవారు.

దూరదర్శన్‌లో రాత్రి తొమ్మిదికి సిద్దార్ధ బసు నిర్వహించే క్విజ్ వచ్చేది. అతనంటే చాలామందికి మేధావి అని హీరో వర్షిప్ ఉండేది. అతన్ని కూడా పురాణంగారు కొట్టిపారేసేవారు.

"వాడి చేతిలో ఆన్సర్స్ గల కార్డ్‌లు ఉంటాయి. ప్రశ్న గొప్పగా అడిగినా సమాధానాలు కార్డులని చూస్తేగాని వాడికీ తెలీదు. ఆ ప్రోగ్రాంలో నన్ను పెట్టి, నా చేతికీ ఆ కార్డ్‌లిస్తే నేనూ గొప్పవాడినవుతాను."

శ్రీ పురాణం తను చదివిన ఒకటి రెండు మంచి పుస్తకాలని నాకు ఇచ్చారు. వాటిలో ఒకటి 'ది ఎనాటమీ ఆఫ్ ఏ రేషనల్ జోక్' ఇందులో అన్నీ పోర్నోగ్రఫీ జోక్సే ఉంటాయి. ఓసారి తను ఇంగ్లీషులో చదివిన ఓ చిన్న కథని నాకు చెప్పారు. నేను రాసిన 'అందమైన జీవితం' అనే నవల క్లైమాక్స్‌కి ఆధారం.

పురాణం గారికి వంటల మీద అభిరుచి ఎక్కువ. మాకు తెలియని రకరకాల తెలుగు వంటల రుచిని, అవి ఎలా చేస్తారో వర్ణించి చెప్పేవారు. తన భార్య పేరుతో రాసిన 'ఇల్లాలి ముచ్చట్లు'లో వీటి ప్రసక్తి వస్తూండేది.

శ్రీ పురాణం గారు ద్వారా వారి ఆఫీస్‌లో పనిచేసే శ్రీ ఐ వెంకట్రావు, (నేటి 'పత్రిక' మంత్లీ సంపాదకులు మహా టి.వి నిర్వాహకులు) ఫిల్మ్ జర్నలిస్ట్ శ్రీ మోహన్ కుమార్, 'బాలజ్యోతి' అనే పిల్లల మాసపత్రిక ఎడిటర్ శశికాంత్ శాతకర్ణిలు

పరిచయమయ్యారు. పురాణం గారి దగ్గర అసిస్టెంట్ ఎడిటర్స్‌గా ఘంటసాల నిర్మల, ఓంకార్‌లు పనిచేసేవారు. నిర్మలగారు చాలా పెద్దమనిషి తరహాగా ఉండేవారు. ఓంకార్ నోరు విప్పితే బూతులు. దాంతో నిర్మలగారు ఇబ్బంది పడేవారు. పురాణం గారు నిర్మలగారికి సర్దిచెపుతుండేవారు. ఓంకార్ కోపం వస్తే రాజీనామా పత్రం రాసిచ్చేవారు. పురాణంగారు ఆయన్ని బతిమాలి దాన్ని వెనక్కి తీసుకునేలా చేసేవారు. చివరికి ఓసారి విసిగిపోయాక ఆ రాజీనామా ఉత్తరాన్ని పైకి పంపించారు. సన్నగా, తెల్లగా చూడడానికి హుందాగా ఉండే ఓంకార్ ఎప్పుడూ మడత నలగని టెర్లిన్ షర్టులనే వాడే వాడు. తర్వాత ఓంకార్ సినిమా ఇండస్ట్రీకి వచ్చి, రచయిత, నటుడుగా మారాడు. ఆంధ్రజ్యోతి ఆఫీస్‌లో తప్ప మళ్ళీ బయట ఎక్కడా ఆయన్ని నేను కలవలేదు.




సీరియల్ నవలకి పారితోషికం నేను, శ్రీ వీరేంద్రనాథ్ డైరెక్ట్‌గా ఆంధ్రజ్యోతి అధినేత శ్రీ కె ఎల్ ఎన్ ప్రసాద్ గారి అబ్బాయి శ్రీ జగదీష్ ప్రసాద్‌తోనే మాట్లాడుకునేవారం. ఇది ఆనాటి పత్రికల్లో రివల్యూషన్ అనే చెప్పాలి. ఎందుకంటే రచయిత సంపాదకుడు ఇచ్చింది తీసుకోవడం తప్ప ఇంత కావాలని డిమాండ్ చేసే పద్ధతి లేదు. రచయిత యాజమాన్యంతో ఈ విషయం కలిసి చర్చించడం అన్న పద్ధతి కూడా అంతకు ముందు ఎన్నడూ లేదు. మేము అడిగేది అధికం కాబట్టి పారితోషికం భారం తన మీద వేసుకోకుండా పురాణంగారు యాజమాన్యానికే దాన్ని వదిలేసారు. అప్పట్లో నాకు సీరియల్‌కి పాతికవేలు ఇచ్చేవారు. చెక్ రూపంలో ఇచ్చేవారు కాబట్టి ప్రత్యేకంగా ఇన్‌కంటాక్స్ రిటన్‌ని 1984 నుంచే ఫైల్ చేయడం మొదలు పెట్టాను.

ఆంధ్రజ్యోతి దినపత్రిక విజయవాడ నుంచి హైదరాబాద్‌కి 1986లో అనుకుంటా షిఫ్ట్ అయింది. పురాణంగారు రిటైరై పోయాక ఆయన సర్వీస్‌ని యాజమాన్యం పెంచలేదు. దాన్నీ హైదరాబాద్ నుంచీ షిఫ్ట్ చేసారు. తర్వాత పురాణంగారు ఉదయం వీక్లీకి ఎడిటర్‌గా ఆయన హైదరాబాద్ వచ్చారు. హిమాయత్ నగర్‌లో మెహతా టవర్స్‌లో ఓ ఫ్లాట్‌ని అద్దెకి తీసుకుని ఉండేవారు. హైదరాబాద్‌లో కూడా అప్పుడప్పుడూ సాయంత్రాలు ఆయన్ని బార్‌కి తీసుకెళ్ళేవాడిని. ఓ రోజు ఆయన చెప్పారు.

"ఇల్లాలి ముచ్చట్లు లాంటి శీర్షికకి పేరు కోసం ఆలోచిస్తున్నాను. నిన్న మీరు మాటల్లో 'ఆలాపనగా' అనే మాటని వాడారు. అది నాకు నచ్చి 'ఆలాపన' అని ఆ శీర్షికకి పేరు పెట్టాను."

జూబ్లి హిల్స్‌లోని జర్నలిస్ట్ కాలనీలో ఆయనకి ఓ స్థలం మంజూరై ఇల్లు కూడా కట్టుకున్నారు. 'ఉదయం' వారపత్రిక ఆగిపోయాక ఆయన మరెక్కడా ఉద్యోగం చేయలేదు. హిమాయత్ నగర్ నుంచి జూబ్లి హిల్స్‌కి మారానని, ఆరోగ్యం బావుండటం లేదని ఓసారి తనని చూసి పొమ్మని ఉత్తరం రాసారు. కాని వెళ్దామనుకుంటూనే బద్ధకించాను. తర్వాత ఆయన జూబ్లి హిల్స్‌లోని ఇంటిని అమ్మేసి, ఆ డబ్బుని నెలసరి ఆదాయం కోసం బేంక్‌లో వేసుకున్నారని విన్నాను. బహుశా పెన్షన్ కూడా ఉండి ఉండకపోవచ్చు. దోమల్ గూడా అడ్రెస్‌తో ఆ తర్వాత మళ్ళీ తనని కలవమని ఆయన్నించి నాకో పోస్ట్ కార్డ్ వచ్చింది. నేను వెళదామనుకుంటుండగానే ఓ సాయంత్రం శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు ఫోన్ చేసి ఆయన పోయారని చెప్పారు. నేను నా జీవితంలో చేసిన కొన్ని ప్రధాన తప్పుల్లో ఒకటి నేను వెళ్ళి వారిని చూడకపోవటం. ఈ రోజుకీ నాలో ఆ అపరాధ భావం ఉంది. నిష్కర్షగా విశ్లేషిస్తే ఆయన ఎడిటర్ కాదు కాబట్టి ఆయనతో అవసరంలేదు అనే భావనతో తాత్సారం చేసి ఉండచ్చు. దీన్నించి నేను నేర్చుకున్న పాఠం, ఎవరైనా అనారోగ్యంగా ఉన్నారని తెలిస్తే, వారిని చూడటం వాయిదా వేయకపోవటం. ఆ తర్వాత మిత్రుడు షిండే (దర్శకుడు)కి ఆరోగ్యం బాగాలేదని ఫోన్ రాగానే వెంటనే వెళ్ళి చూసి వచ్చాను. నేను అతన్ని చూసిన మూడు గంటల తర్వాత అతను పోయాడని ఫోన్ వచ్చింది.

పురాణంగారిలో హాస్య చతురత అపారం. ఎదుటివారు హర్ట్ అవకుండా కీలెరిగి వాతపెట్టి మాట్లాడగలరు. ఆయన్ని రాజాలక్ష్మి ఫౌండేషన్ వారు అమెరికాకి పంపారు. ఆయన తిరిగి వచ్చాక కలిసినప్పుడు నాతో అన్న మాటలు నాకింకా గుర్తున్నాయి.

"అమెరికాలో నాకు తెలిసిన వాళ్ళిద్దరే కనపడ్డారు. పగలు సూర్యుడు రాత్రి చంద్రుడు. మిగతావన్నీ కొత్త ముఖాలే."

ఆయనకి అక్కడ ఎవరో సూట్ కొనిచ్చారు. నేను ఉదయం ఆఫీసుకి వెళ్ళినప్పుడు దాన్ని ఆయన ధరించి ఉన్నారు. అది బావుందని నేను మెచ్చుకుంటే, ఆయన సీరియస్‌గా ఇలా చెప్పారు.

"మద్రాస్ నుంచి ఈ సూట్‌లో రైల్లో విజయవాడ వస్తూంటే ప్రయాణీకులంతా నా చుట్టూ మూగి 'మాకో బెర్త్ కావాలి' అని అడిగారు. నా నల్ల కోటు చూసి నన్ను టి.సి అనుకున్నారు." ఆయన చెప్పిన మరో సంగతి. "మీకు, చాలామందికి అమెరికా నుంచి ఉత్తరాలు రాసాను. ఓ రోజు వాకింగ్ కి వెళ్ళినప్పుడు వాటిని పోస్టు డబ్బాలో వేసాను. తర్వాత తెలిసింది అది ట్రేష్ కేన్ అని. చెత్త డబ్బా కూడా మన దేశంలోని పోస్ట్ బాక్స్‌లా చుట్టూ చెత్తలేకుండా మెయిన్‌టెయిన్ చేస్తారు వెధవలు."

అమెరికాకి వెళ్ళబోయే ముందు పురాణంగారు నాతో అన్నారు.

"నేనెప్పుడూ ఆఫీస్‌కి శెలవు పెట్టి ఎక్కువ రోజులు వెళ్ళను. ఎందుకంటే మేనేజ్ మెంట్‌కి మనం లేకున్నా కూడా పత్రిక వస్తుందని అర్ధమవుతుంది. ఒక్కోసారి ఇంకా బాగా కూడా రావచ్చు. అప్పుడు మన అవసరం లేదని ఉద్యోగంలోంచి తీసేస్తారని భయం. మనం రోజూ ఆఫీస్‌కి వెళుతూంటే, మనం లేకపోతే పత్రిక ఆగిపోతుందనే నమ్మకంతో ఉంటారు"

శ్రీ వీరేంద్రనాథ్‌ని నేను మనస్ఫూర్తిగా మెచ్చుకునే విషయాల్లో ఒకటి ఆయన శ్రీ పురాణం గారికి తను దర్శకత్వం వహించిన సినిమా 'అగ్నిప్రవేశం'లో వేషం ఇవ్వడం. అందుకు పురాణంగారు ఎంతో ఆనందించారు. మా ఇంటికి ఓసారి శ్రీ జంధ్యాల, శ్రీ పురాణం గార్లని రాత్రి భోజనానికి ఆహ్వానించాను. శ్రీ జంధ్యాల వారికి నమస్కరించి, తను రాసిన మొదటి నాటకాన్ని ఆంధ్రజ్యోతి ఆఫీస్‌కి తీసుకువెళ్ళి పురాణం గారికి చూపించానని, ఆయన తాము నాటకాలు ప్రచురించమని చెప్పి, అక్కడక్కడ చదివి 'నేను పొరబడకపోతే బానే రాసినట్లున్నావ్' అని మెచ్చుకున్నారని, దాంతో తనకి ధైర్యం వచ్చిందని గుర్తుచేసుకున్నారు.

హైదరాబాద్‌లో శ్రీ వై. సదాశివరావు అనే ఐ.పి.యస్ ఆఫీసర్ పనిచేసేవారు. వారు కథలు రాసేవారు. పురాణానికి మంచి మిత్రులు. మా ఇద్దర్నీ సదాశివరావు గారింటికి అప్పుడప్పుడు భోజనానికి పిలిచేవారు. మందు కొట్టినపుడు శ్రీ పురాణం మాంసాహారి. శ్రీ సదాశివరావు ఎంతో ఆప్యాయంగా తనే అందరికీ వడ్డించేవారు. పోలీస్ క్లబ్ నుంచి వంటకాలు వచ్చేవి.

కమ్యూనిస్ట్ సిద్ధాంతాలంటే ఎంత ఇష్టం ఉన్నా అమెరికా నుంచి వచ్చాక శ్రీ పురాణం మిగిలిన కమ్యూనిస్టుల్లా అమెరికాని తిట్టిపోయలేదు. అక్కడ నచ్చిన ఎన్నో అంశాలని చెప్పేవారు. సందర్భం వచ్చినప్పుడల్లా నేను చెప్పే మాటలివి.

"నేడు పురాణం సుబ్రమణ్య శర్మలాంటి ఎడిటర్ ఏ వారపత్రికకీ లేకపోవడం బాధగా ఉంది."

*(మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో..)*

**NEW**
Click here to share your comments on this story